

- షాద్ నగర్ లో దర్జాగా దొంగ రిజిస్ట్రేషన్లు
- చిలకమర్రిలో రూ. 7 కోట్ల విలువైన భూమి కాజేసిన వైనం
- ఓటిపిల సహాయంతో భారీ మోసం
- షాద్ నగర్ పోలీస్ స్టేషన్లో ఫరూక్ నగర్ తహసిల్దార్ ఫిర్యాదు
- జిల్లా కలెక్టర్, ఆర్ డి ఓ, ఏసీపీలకు ఫిర్యాదు
- తహసిల్దార్ ఫిర్యాదు పై కేసు నమోదు చేసిన షాద్ నగర్ పోలీసులు..
- చిలకమర్రి గ్రామానికి చెందిన కొత్తపల్లి సుభాన్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, నవనీత, మీసేవ సెంటర్ యజమాని, ఆపరేటర్ తదితరులపై కేసు

# "మీసేవ" కేంద్రంగా గూడుపుఠాణి

షాద్ నగర్- ప్రభాత సూర్య (జోన్ ఇంచార్జ్)

**బాగా తెలివి ఉంటె పర్వాలేదు కానీ మితిమీరిన తెలివితో ఏదైనా చేయవచ్చని అనుకున్నారో ఏమో గానీ కుట్రపూరితంగా వ్యవహరించిన కొందరు ప్రబుద్ధులు రైతులకు సంబంధించిన భూమిని అప్పనంగా కాజేశారు. రూ. ఏడు కోట్లకు పైగా విలువైన** సుమారు నాలుగు ఎకరాల పైచిలుకు భూమిని రైతులకు తెలియకుండానే మోసపూరితంగా ఇతరులకు దారా దత్తం చేశారు. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజక వర్గంలో చోటుచేసుకుంది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుల పుణ్యమా అని ఈతతంగం వెలుగు చూడడం గమనర్హం. ఈతతంగంలో రెవెన్యూ అధికారులకు కూడా అర్థం కాని రీతిలో మీసేవ సెంటర్ నిర్వాహకుడు సదరు అక్రమార్కులతో కుమ్మక్కై ఈ మొత్తం స్టోరీలో కీలక పాత్ర వహించాడు. లేని ఏజీపీలను సృష్టించి దొంగ డాక్యుమెంట్లను తయారుచేసి రిజిస్ట్రేషన్ కోసం అన్ని పద్ధతులు అవలంబించాడు. తీగ లాగితే డొంక కదిలినట్లు ఇద్దరు రైతులకు సంబంధించిన భూముల కాజేసిన విషయంలో బాధితులు లబోదిబోమంటూ ఫరూక్ నగర్ రెవిన్యూ కార్యాలయానికి వెళ్లి వాస్తవాలు అధికారికి వివరించడంతో ఈ కుట్ర బయటపడింది. తహసిల్దార్ ఫిర్యాదు మేరకు షాద్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసిన ఈ సంచలన సంఘటన వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

### అసలేం జరిగిందంటే..?

ఫరూక్ నగర్ మండలం చిలకమర్రి గ్రామానికి చెందిన మహిళ రైతు కొత్తపల్లి వినోద భర్త శ్రీనివాస్ రెడ్డి చనిపోయాడు. అయితే విరాసత్ ప్రకారం ఆమెకు చిలకమర్రి గ్రామ శివారులో చెల్క భూమి సర్వేనెంబర్ 74/ఆ1/2//1లో ఇరవై ఒకటిన్నర గుంటల భూమి, అదేవిధంగా సర్వే నెంబర్ 68/ఆ/1/2/1 లో 1ఎకరా 32 గుంటలు, 59/ఇ/2/1 లో 15 గుంటలు, ఇలా మొత్తం రెండు ఎకరాల 28.5 గుంటల భూమి కొత్తపల్లి వినోద పేరిట 2022లో విరాసద్ జరిగింది. ఇదే భూమికి సంబంధించి కొత్తపల్లి వినోద మామ అయిన సుభాన్ రెడ్డి, అతని మరో కుమారుడు మధుసూదన్ రెడ్డిలు కలిసి ధరణిలోని లొసుగులను ఆసరాగా చేసుకుని పట్టణంలోని ఒక మీసేవ సెంటర్ యజమాని ఆపరేటర్ తో కుమ్మక్కై జిపిఏ డాక్యుమెంట్ ను సృష్టించారు. కొత్తపల్లి వినోద ఫోన్ ద్వారా ఓటిపిని సంపాదించి ఈ అక్రమాలకు పాల్పడ్డారు. అయితే ఇటీవల ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేయడంతో చిలకమర్రి గ్రామంలో డిప్యూటీ తహసిల్దార్ ఆనంద్ సింగ్ కు కొత్తపల్లి వినోద కలిసి తన భూమికి సంబంధించిన విషయంలో వినతి పత్రం ఇవ్వడానికి వచ్చారు. అయితే ఈ భూమి జిపిఏ ద్వారా ఇతరులకు వెళ్లిందని చెప్పడంతో ఆమె తనకేమీ తెలియదని చెప్పడంతో ఈ బండారం బయటపడింది. ఆ తర్వాత వినోద రెవెన్యూ సదస్సులు ముగిసిన అనంతరం అధికారిని కలిసి లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. దీంతో ఈ ఓటిపిత తంగంతో జరిగిన డ్రామా వెలుగు చూసింది.

### మరో మరో సంఘటన .. చేసింది కూడా వాళ్లే..

ధరణి లొసుగుతో ఆరితేరిన కొత్తపల్లి సుభాన్ రెడ్డి అతని కుమారుడు కొత్తపల్లి మధుసూదన్ రెడ్డి కలిసి చిలకమర్రి గ్రామానికి చెందిన మరో అమాయక రైతు కొత్తపల్లి నరసింహారెడ్డిని వారి కుట్రలో భాగంగా మరోసారి టార్గెట్ చేశారు. చిలకమర్రి గ్రామానికి చెందిన కొత్తపల్లి నరసింహారెడ్డి కి చెందిన సర్వే నెంబర్ 56/ఇ/1, అదేవిధంగా 59/ఆ/అ/2, అలాగే 59 సర్వే నెంబర్లలో గల ఒక ఎకరా 29 గుంటల భూమికి సంబంధించి కొత్తపల్లి మధుసూదన్ రెడ్డి అనే వ్యక్తి నరసింహారెడ్డి కి సంబంధించిన సతీమణి నవనీతను రంగంలోకి దించి మరో ఏజిపి డ్రామా మొదలుపెట్టారు. మీసేవ సెంటర్ లో మళ్లీ జీపీఏ డాక్యుమెంట్లు సృష్టించారు. ఎలాగంటే నరసింహారెడ్డి సతీమణి నవనీత కొంతకాలంగా సంసారంలో మనస్పర్ధలు రావడంతో వేరేగా ఉంటున్నారు. దీనిని అదునుగా చేసుకొని మధుసూదన్ రెడ్డి అనే వ్యక్తి నరసింహారెడ్డికి సంబంధించిన సిమ్ నెంబర్ ఆయన సతీమణి నవనీత వద్ద ఉండడంతో దాని ద్వారా ఓటీపీ పొంది మరో జిపిఏ డాక్యుమెంట్ ను సృష్టించారు. అక్కడితో ఆగకుండా సదరు భూమిని దేవి రెడ్డి శ్రీకాంత్ రెడ్డి పేరిట డాక్యుమెంట్ నెంబర్ 508/2025 ప్రకారం సేల్ డీడ్ చేశారు. ఇలా భూములు పట్టేదారులకు తెలవకుండానే కొత్తపల్లి సుభాన్ రెడ్డి, కొత్తపల్లి మధుసూదన్ రెడ్డి, నవనీత, మీసేవ సెంటర్ యజమాని, అదేవిధంగా ఆపరేటర్ ఈ అక్రమాలకు పాల్పడినట్లు తేలింది.

### సార్ ఇదెక్కడి న్యాయం..

సార్ మాకు తెలియకుండానే మా భూములు ఎక్కడికి పోయాయి. దయచేసి న్యాయం చేయండి అంటూ రైతులు వారి బంధువులు సోమవారం ఫరూక్ నగర్ తహసిల్దార్ వద్దకు లబోదిబోమంటూ పరుగులు తీశారు. తమ ప్రమేయం లేకుండా తమ భూములు ఎలా రిజిస్ట్రేషన్ జరిగాయి అని అధికారి పార్థసారథినీ అడిగారు. ఈ దెబ్బతో కంగుతిన్న అధికారులు సైతం ఎక్కడ పొరపాటు జరిగిందని దీనిపై తర్జనభజనలు చేశారు. వచ్చిన డాక్యుమెంట్లు, స్లాట్ బుకింగ్, అవన్నీ పరిశీలించి చివరకు మీసేవ సెంటర్ ద్వారా ఓటీపీలతో కొత్త డాక్యుమెంట్లు సృష్టించి స్లాట్ బుక్ చేశారని అర్థమైంది. వెంటనే ఆలస్యం చేయకుండా తహసిల్దార్ పార్థసారథి షాద్ నగర్ పోలీస్ స్టేషన్లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో ఈ వ్యవహారంపై ఫిర్యాదు అందుకున్న పట్టణ సిఐ విజయ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని వెల్లడించారు. దీనికి సంబంధించి ధరణి లసుగు ద్వారా ఎలా డాక్యుమెంట్ సృష్టించబడ్డాయో వాటిపై జిల్లా కలెక్టర్ ఆర్డిఓ అదే విధంగా ఏసిపి అధికారికి దీని ప్రతులను పంపించినట్లు రెవెన్యూ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఇలాంటి ఘటనల ద్వారా అధికారులు మాత్రం తమ ఫోన్లకు ఓటీపీలు వస్తే దయచేసి ఎవరికీ చెప్పవద్దని కోరుతున్నారు. ఓటీపీలు చెబితే తీవ్ర అన్యాయం జరుగుతుందని ఎవరికి ఓటీపీలు కానీ ఫోన్లు కానీ ఇవ్వకూడదని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. మొత్తం ఈ వ్యవహారంలో డాక్యుమెంట్లు సృష్టించిన వారు ఇందులో ప్రత్యక్షంగా పరోక్షంగా పాల్గొన్న వారు అదే విధంగా సాక్ష్యం సంతకాలు పెట్టినవారు కూడా ఇందులో నిందితులుగా చేరే అవకాశం ఉంది. ఇంకా ఇలాంటి ఘటనలు ఎన్ని జరిగాయి అన్న కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు..